24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

హనుమకొండ చౌరస్తా, మే 22 : ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఐఈవో అజ్మీరా గోపాల్ తెలిపారు. 34 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నామని, మొదటి సంవత్సరంలో 13,014మంది, రెండో సంవత్సరంలో 5,103, ప్రాక్టికల్ 24, మొత్తం 18,141 మంది పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు 2:30 నుంచి 5:30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు 34మంది, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ 34మంది, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు 24మంది, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 2 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 650 మంది ఇన్విజిలేటర్స్‌ను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

తాటికొండ రమేశ్‌పై ఎంక్వైరీ ప్రారంభించాలి

హనుమకొండ చౌరస్తా, మే 22 : కేయూ మాజీ వీసీ తాటికొండ రమేశ్‌పై ఎంక్వైరీకి ఆదేశించి 4 రోజులు గడుస్తున్నా ఇంకా స్పెషల్ ఆఫీసర్‌ను నియమించకపోవడం శోచనీయమని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు అన్నారు. పరిషత్ వర్సిటీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో ఆయన మాట్లాడారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే వెంటనే రమేశ్‌ను అదుపులోకి తీసుకోవాలని, లేకపోతే ఆయన అనుచరులు ఫైల్స్ టాంపరింగ్ చేసే ప్రమాదం ఉందన్నారు. అనుచరులైన భూకబ్జా కోరు ఏఆర్ అశోక్ బాబు, మల్లికార్జున్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మల్లారెడ్డి, సదానందంను విధుల నుంచి తొలగించి విచారించాలని, అలా చేస్తేనే నిజాలు బయటకు వస్తాయన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, ఉపాధ్యక్షుడు రాజు, రాష్ట్ర నాయకులు ప్రశాంత్, సాయి, చంద్రశేఖర్, లక్ష్మణ్, రాజేశ్, విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థుల యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న డీఈవో వాసంతి

అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన

సంగెం, మే 22 : మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను డీఈవో వాసంతి బుధవారం తనిఖీ చేశారు. చింతలపల్లి, వీఆర్ఎన్ తండా, ఎల్గూర్‌రంగంపేట, తిమ్మాపురం ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలని, నాణ్యత లోపించొద్దని సూచించారు. సంగెంలో యూనిఫామ్ కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ జ్ఞానేశ్వర్, ఏఈ రమేశ్, ఎంఈవో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈసెట్‌లో మార్కులు తక్కువొచ్చాయని..

- ఈ నెల 9న పురుగుల మందు తాగిన విద్యార్థి
- దవాఖానలో చికిత్స పొందుతూ మృతి

గీసుగొండ, మే 22 : చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందిన ఘటన గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటలో జరిగింది. సీఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్ (21) తనకు ఈసెట్‌లో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపానికి గురై ఈ నెల 9న ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హనుమకొండలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ నిమ్స్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మహారాజశ్రీ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వరంగల్ గారి కోర్టునందు

EP.No. 402 of 2006
in O.S.No. 1510 of 2005

Between:
గోళి అయిలమ్మ ...డిక్రీ హోల్డరు
మరియు
కంచె రామక్క ...జడ్జిమెంటు డెబిటర్

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా పై EP.No. 405/2006 లోని Decree Holder తనకు మహారాజశ్రీ పై కోర్టు వారు ఇచ్చిన O.S.No. 1510/2005 లోని డిక్రీ సొమ్ము వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా రాబట్టుకొనుటకు గాను EPలోని Judgement Debtor కు చెందిన ఈ దిగువ షెడ్యూల్లులో చూపబడిన ఇల్లు మరియు ఖాళీ స్థలమును దినా. 18-06-2024 రోజున ఉదయం గం. 10.30 ని.లకు పైన తెలుపబడిన కోర్టు నందు బహిరంగ వేలం వేయబడును. ఇట్టి ఇంటిని మరియు ఖాళీ స్థలమును కొనుగోలు చేయుటకు ఆసక్తి కలవారు వేలం పాటలో, వేలం షరతులకు లోబడి పాటలో పాల్గొనగలరు.

షెడ్యూల్లు ఆస్తి: వరంగల్ పట్టణంలోని కరీమాబాదులోగల ఇల్లు మరియు ఖాళీస్థలం MPL.No. పాతది 17/254/ 1, కొత్తది (17-3-30), 17-3-88, 188.50 చ.గ.లు లేదా 157.61 చ.మీ.లు ఈ క్రింది హద్దుల మధ్యన్న గలదు. తూర్పు: మున్సిపల్ రోడ్డు, పడమర: శ్రీ సీతారామా స్వామి దేవస్థానం మరియు ఖాళీస్థలం, ఉత్తరం: గోపు ఓదెలు గారి ఇల్లు మరియు ఖాళీ స్థలం, దక్షిణం: దూడె అయిలయ్య గారి ఇల్లు మరియు ఖాళీ స్థలం.

కోర్టు వారి అనుమతితో
ఇట్లు: పొడాల సుదర్శన్ B.A., LL.B
అడ్వకేట్, ఇ.నెం. 11-18-552, వివేకానంద కాలనీ, కాశీబుగ్గ, వరంగల్. సెల్: 9949286591

రాయపర్తి : సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

హనుమకొండ చౌరస్తా : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- అమలుకు నోచుకోని రేవంత్ హామీలు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం

వర్ధన్నపేట, మే 22: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పట్టభద్రులను కోరారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి గత శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచాడన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఎద్దేవా చేశారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నాయకులు గుజ్జ సంపత్‌రెడ్డి తుమ్మల యాకయ్య, తూళ్ల కుమారస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లన్నకు గుణపాఠం చెప్పాలి..

రాయపర్తి/పర్వతగిరి : పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో మీడియా ముసుగులో బ్లాక్ దందాలకు పాల్పడుతున్న తీన్మార్ మల్లన్నకు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ అధ్యక్షతన పట్టభద్రులు, నాయకులతో సమావేశమయ్యారు. రేవంత్ రెడ్డి సర్కార్ విద్యావంతులు, నిరుద్యోగులకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించా రు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు లక్ష్మీనరసింహారావు, అనిమిరెడ్డి, కుమార్, ఆకుల సురేందర్‌రావు పాల్గొన్నారు. అలాగే, పర్వతగిరిలో పట్టభద్రులు, బీఆర్ఎస్ నేతలతో ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

నర్సంపేటరూరల్/హసన్‌పర్తి: వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని దాసరిపల్లి, చిన్నగురిజాల, ముగ్దుంపురం, గురిజాలలో బుధవారం వారు పార్టీ నాయకులతో కలిసి పట్టభద్రులు ఉన్న ఇండ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో క్లస్టర్ బాధ్యులు మోతె పద్మనాభరెడ్డి, కడారి కుమారస్వామి, కోమాం డ్ల గోపాల్‌రెడ్డి, మోతె జయపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అల్లి రవి, చిన్నపెల్లి నర్సింగం, రాజ్‌కుమార్, రమేశ్, సదానందం పాల్గొన్నారు. అలాగే, రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ 66 డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో నాయకులు హసన్‌పర్తి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని పట్టభద్రులైన ఏపీవో విజయలక్ష్మి, సెక్రటరీ వెంకన్నను ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బండి రజినీకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట/దామెర : రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాజీపేటలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేశ్, శిరుమల్ల దశరథం, గబ్బెట శ్రీనివాస్, అప్పజల్, రామగిరి రాంచందర్, హుస్సేన్, మర్యాల కృష్ణ, మైలారం శంకర్, గబ్బెట కరుణ్, కుమార్, రవి, మంద రాజ్‌కుమార్, గాజుల విజయ్, సతీశ్, కల్యాణ్, రజిని, సవిత పాల్గొన్నారు. దామెరలో మండల అధ్యక్షుడు బత్తిని చిన్నరాజుయాదవ్, ఎమ్మెల్సీ ఎన్నికల మండల ఇన్‌చార్జి సొనబోయిన కిశోర్ ఆధ్వర్యంలో దామెర, పులుకుర్తి, ఊరుగొండ, ల్యాదెళ్ల, వెంకటాపురం, కోగిల్వాయిలో నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు సంతోష్, గణేశ్, రవి కుమార్, సునీల్, ఎంపీటీసీలు సంగనబోయిన మానిక-కిరణ్, గోవిందు అశోక్, కునాటి సునీల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పున్నం సంపత్, గోవిందు అశోక్, ఎడ్ల గోపాల్, హింగె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు : చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ చౌరస్తా : చట్టసభల్లో తెలంగాణ గళం వినిపించాలంటే సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన బిడ్డ, బిట్స్ పిలానీలో చదివిన విద్యాధికుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డికే మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని ముఖ్యనాయకులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపని అన్నారు. నియోజకవర్గంలోని 15 వేల పట్టభద్రులను బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యక్షంగా కలిసి ఓటు అభ్యర్థించాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గమనించాలని ఓటర్లను కోరారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్, నాయకులు బండి సారంగపాణి, నేతాని శ్రీనివాస్ రెడ్డి, రేవూరి జైపాల్‌రెడ్డి, చందుపట్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టాలి

నయీంనగర్, మే 22 : ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ కార్యాలయంలో డిప్యూటీ కంట్రోలర్ విజయ్‌కుమార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం ఆహార కల్తీ జరుగుతూనే ఉన్నదన్నారు. 24 గంటల వరకే నాణ్యతగా ఉండే పాలను రెండు, మూడు రోజుల వరకు ఉండడానికి హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనాన్ని కలపడం సర్వసాధారణమైందన్నారు. వినియోగదారుల్లో ఆహార కల్తీపై చైతన్యం కల్పించాలన్నారు. సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, క్యాట్‌కో చైర్మన్ శంకర్‌లాల్ చౌరాసియా పాల్గొన్నారు.

మాడిఫైడ్ సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

మార్పు చేసిన సైలెన్సర్ల ధ్వంసం

సుబేదారి, మే 22 : కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మార్చి బైక్‌లకు అమర్చిన అధిక శబ్దం వచ్చే 261 సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు బుధవారం హనుమకొండలోని వరంగల్ కమిషనరేట్ ఎదుట రోడ్డుపై ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. బైక్‌లకు కంపెనీతో వచ్చే సైలెన్సర్లను మార్చి అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చి బైక్ నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, ట్రాఫిక్ సీఐలు షుకూర్, నాగబాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి : ఏసీపీ

గిర్మాజీపేట, మే 22: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా మెలగాలని ఏసీపీ నందిరామ్‌నాయక్ సూచించారు. బుధవారం ఆయన ఇంతెజార్‌గంజ్ పీఎస్‌ను తనిఖీ చేసి సీఐ మచ్చ శివకుమార్ సమక్షంలో రిసెప్షన్, స్టేషన్ ఇన్‌చార్జీలతో మాట్లాడారు. ఈ మేరకు క్రైం కానిస్టేబుల్ శివను ఏసీపీ అభినందించారు. ఎస్సై వెంకన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ, మే 22 : ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు ఔత్సాహిక బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మధురిమ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 ఏళ్లలోపు బాల బాలికలు http://awards.gov.in వెబ్ సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు కలెక్టరేట్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కేటీఆర్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

కేటీఆర్‌ను కలిసిన కేయూ బీఆర్ఎస్వీ నాయకులు

హనుమకొండ చౌరస్తా, మే 22 : మాజీ మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్వీ నాయకులు కలిశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో సూర్యకిరణ్, వీరేందర్, జోరిక రమేశ్, సుమన్, మనోజ్‌కుమార్, ప్రశాంత్, రంజిత్, రాజేందర్ ఉన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఖిలావరంగల్, మే 22: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో పీ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్‌లో హనుమకొండ అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి ఆమె అధికారులతో సమీక్షించారు. కౌంటింగ్ జరుగనున్న ఎనుమాముల మార్కెట్ యార్డులో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన కౌంటింగ్ జరుగనున్న యార్డులో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సజావు జరిగేలా సహకరించాలని కోరారు. డీఆర్వో శ్రీనివాస్, డీపీఆర్వో అయుబ్ అలీ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంల పరిశీలన

కాశీబుగ్గ : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో స్ట్రాంగ్ రూంలను బుధవారం కలెక్టర్ ప్రావీణ్య రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. అనంతరం విజిటర్స్ రిజిస్టర్‌లో వారు సంతకాలు చేశారు. డీపీఆర్వో అయూబ్ అలీ, భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామ్‌కుమార్‌రెడ్డి, విశ్వనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇరువర్గాలు సంయమనం పాటించాలి

కాజీపేట, మే 22 : గ్రానైట్ క్వారీ యాజమానులు, కాలనీల వాసులు సంయమనం పాటించాలని కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి సూచించారు. గ్రానైట్ క్వారీ భారీ లారీలు బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల అంతర్గత రోడ్ల మీదుగా మంగళవారం రాత్రి రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులు అడ్డుకుని, బుధవారం కాజీపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ క్వారీ యాజమానులు, కాలనీ వాసులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ అంశంపై ఇరువర్గాలు గతంలోనే కోర్టును ఆశ్రయించాయి. కాగా, కాలనీల రోడ్ల మీదుగ లారీలు రాకపోకలు సాగించొచ్చనే కోర్టు ఆర్డర్ కాపీని ఇవ్వాలని క్వారీ యాజమనులకు సూచించారు. అంత వరకు కాలనీల మీదుగా లారీల రాకపోకలను బంద్ చేయాలన్నారు. క్వారీ లారీలను అడ్డుకోవడం సరికాదని, లారీలు కాలనీల నుంచి నడపకూడదనే ఆర్డర్‌ను కోర్టు నుంచి తీసుకురావాలని కోరారు. అప్పటివరకు కావాలని ఎవరైనా గొడవలకు దిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్వారీ యాజమాని పల్లపు వెంకటస్వామి, కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోజన, భద్రయ్య, మేకల రవీందర్, రాజయ్య, జగదీశ్వర్, ఉమ ఉన్నారు.

జీవ వైవిధ్యమే మానవ మనుగడకు ఆధారం

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

హనుమకొండ చౌరస్తా, మే 22 : జీవ వైవిధ్యమే మానవ మనుగడకు ఆధారమని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో తెలంగాణ జీవ వైవిధ్య మండలి, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, జనవిజ్ఞాన వేదిక, వనసేవ సొసైటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. సభాధ్యక్షుడిగా పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం వ్యవహరించగా, ముఖ్యవక్త ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశర్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విజిలెన్స్ డీఎఫ్‌వో నాగభూషణం మాట్లాడుతూ.. పర్యావరణమే ప్రాణాధారం అన్నారు. సదస్సు ప్రారంభానికి ముందు వివిధ సంస్థల ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఇంద్రజాలికుడు జయకర్ స్నేక్ అవేర్నెస్ షో నిర్వహించారు. విశ్రాంత ఆచార్యులు లక్ష్మీరెడ్డి, ఎస్ రాజు, పుల్లూరు సుధాకర్ వివిధ పర్యావరణ అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎస్పీ సైబర్ క్రైమ్ విజయకుమార్, డీఆర్‌వో వైవీ గణేశ్, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ సుభాశ్, గ్రేటర్ అడిషనల్ కమిషనర్ అనీసుర్ రషీద్, మున్సిపల్ ఉద్యానవన అధికారి రమేశ్, జీవవైవిధ్య మండలి జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మి, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్, జేవీవీ ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, రాములు, ఔల్స్ సంస్థ బాధ్యులు శ్యాంసుందర్‌శర్మ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అందంగా తీర్చిదిద్దాలి

వరంగల్ : గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో పార్కులను అందంగా తీర్చిదిద్దాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె కుక్కల శస్త్ర చికిత్స కేంద్రం, శ్రీనగర్‌కాలనీ, రీజినల్ లైబ్రరీ పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలోని వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల సంఖ్యను పెంచాలన్నారు. గ్రేటర్‌లో కుక్కల బెడద ఉన్న డివిజన్‌లలో ప్రతిరోజూ కుక్కలను బంధించాలని ఆదేశించారు. టీఎల్ఎఫ్‌లకు అప్పగించిన పార్కుల నిర్వహణ సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో సిబ్బందిని నియమించి పార్కుల నిర్వహణ సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేశ్, వెటర్నరీ అధికారి గోపాల్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా నాయక్, హార్టికల్చర్ అసిస్టెంట్లు అశ్విని, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ చౌరస్తా : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

రేపు పాలిసెట్

- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ప్రిన్సిపాల్ ప్రభాకర్

హనుమకొండ చౌరస్తా, మే 22 : ఈ నెల 24న పాలిసెట్-2024 నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. నగరంలో 12 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 5624 మంది విద్యార్థులు హాజరవుతారని, విద్యార్థులను పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే రావాలని చెప్పారు. విద్యార్థులు 10 గంటలకే పరీక్ష హాల్‌కు చేరుకొని ఓఎంఆర్ షీట్‌లో వివరాలు నింపి సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు తమ వెంట హెచ్‌బీ, 2బీ బ్లాక్ పెన్సిల్, ఇరేసర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తప్పక తీసుకొని రావాలన్నారు. 11 తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని తెలిపారు. హాల్‌టికెట్ మీద ఫొటో ప్రింట్ కానివారు పాస్‌పోర్టు సైజు ఫొటో (ఆధార్ కార్డు) తెచ్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు అనుమతించమని చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- కొనుగోలు కేంద్రాల తనిఖీ

ఆత్మకూరు, మే 22 : యాసంగి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం పెంచికలపేట సొసైటీ ఆధ్వర్యంలో నీరుకుళ్లలో ఏర్పాటు చేసిన, పరకాల పట్టణంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రుతుపవనాలు ముందుస్తుగా వస్తున్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జూన్ మొదటి వారంలోగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు నచ్చజెప్పారు. అవసరమైన వాహనాలు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీసీవో నాగేశ్వర్‌రావు, నోడల్ అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఆర్డీవో నారాయణ, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఈవో మానస, సీఈవో ఓదెల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులో తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

'చెరువులో తవ్వకాలను నిలిపివేయాలి'

హసన్‌పర్తి, మే 22: నాగారం చెరువు మత్తడి వద్ద తవ్వకాలు నిలిపివేయాలని మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు దామెర రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన డైరెక్టర్లతో కలిసి చెరువును పరిశీలించారు. చెరువు కింద నాగారం, బైరాన్‌పల్లి, సిద్దాపూర్ గ్రామాలు, అలాగే, 180 మంది మత్స్య కార్మికులు చెరువుపై ఆధారపడి చేపలు పట్టి జీవనం సాగిస్తున్నారని ఆయన తెలిపారు. కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకుండా మత్తడి వద్దే తవ్వకాలు చేపట్టారని ఆరోపించారు. అధికారులు చెరువును పరిశీలించి తమకు న్యాయం కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు తాళ్ల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కే మల్లయ్య, డైరెక్టర్లు అగ్ని కులశేఖర్, రావుల సమ్మయ్య, కుమారస్వామి, సృజన్, ర